వాల్టా చట్టానికి తూట్లు



ట్రాక్టర్, లారీలో తరలి వెళుతున్న కలప

- యథేచ్ఛగా భారీ చెట్ల నరికివేత
- అక్రమంగా కలప తరలింపు
- అనధికారికంగా బోర్ల తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

సీతారామపురం : ప్రకృతి సహజ వనరుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్టా చట్టానికి కొందరు తూట్లు పొడుస్తున్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి...పర్యావరణాన్ని పరిరక్షించాలి..పచ్చని చెట్లను నరికేస్తే భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ పచ్చదనాన్ని నాశనం చేస్తున్నారు. అనుమతి లేకుండా భారీగా వృక్షాలను నరికి కలపను లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే బోర్లను అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తూ భూగర్భజలాలను దుర్వినియోగం చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి పచ్చదనాన్ని, భూగర్భజలాలను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేలకొరుగుతున్న భారీ వృక్షాలు

ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 55,218 హెక్టార్లలో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. మారుమూల ప్రాంతమైన సీతారామపురం మండలంలో 16,214 హెక్టార్లలో అడవులు ఉన్నాయి. అలాగే గ్రామాల్లోని చెరువుకట్టలు, బంజరు భూముల్లోనూ కొంత మేర పచ్చదనం ఉంది. పచ్చదనాన్ని కాపాడాల్సిన రెవెన్యూ, అటవీ అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు అక్రమార్కులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వీఆర్వోలతో కలిసి వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తున్నారు. భారీ చెట్లను సైతం నరికి కలపను అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల్లోని చెట్లను సైతం నరికివేసి ప్రకాశం, కడప జిల్లాలోని మిల్లులకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో అనధికారికంగా బోర్లను వేస్తూ భూగర్భజలాల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా మొక్కలు నాటకపోవడం, ఉన్నవాటిని నేల కూల్చడం, భూగర్భజలాలు అడుగంటడం వల్ల ప్రకృతి ప్రకోప పరిస్థితులు వెంటాడుతున్నాయి. దీంతో వేసవికి ముందే ఎండలు విపరీతంగా కాయడం, అకాల వర్షాలు కురవడం, కార్తెల సమయంలో సక్రమంగా వర్షాలు పడకపోవడం వంటివి అందుకు అద్దం పడుతున్నాయి. ఈ విధానంలో మార్పు కనిపించకపోతే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవు.

వాల్టా చట్టం అంటే

ప్రభుత్వం ప్రకృతి సహజన వనరుల పరిరక్షణకు వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం చెట్లు నరికేందుకు, బోర్లు వేసేందుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. పట్టా భూమిలో చెట్లను నరకాలంటే తహసీల్దార్ ధ్రువీకరణపత్రాన్ని అటవీ శాఖ అధికారులకు అందజేయాలి. అనంతరం వారు చెట్లను అంచనా వేసి కోత అనుమతి కోసం జిల్లా అటవీ శాఖ అధికారికి నివేదిక పంపాలి. వారు పరిశీలించి పర్మిట్ ఇస్తే టన్ను కలపకు నిర్దేశించిన రుసుము చెల్లించిన తర్వాతే అనుమతి ఇవ్వాలి. మండలస్థాయిలో వాల్టా చట్టం అమలు బాధ్యత రెవెన్యూ శాఖదే. మండల స్థాయి, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. అయితే 12 ఏళ్ల కిందట తీసుకొచ్చిన ఈ చట్టం అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల ఉదాసీనత కారణంగా సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నా, అనధికారికంగా బోర్లు వేస్తున్నా, పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ సిబ్బంది అక్రమార్కులతో లాలూచీపడి దొడ్డిదారిన అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


సింగారెడ్డిపల్లె వద్ద నరికేయగా మిగిలిన భారీ చెట్టు మొదలు

చట్టం అమలుకు పటిష్ట చర్యలు



వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడతాం. గ్రామాల్లో కచ్చితంగా అమలు చేసేలా వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేస్తాం. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడి అనధికారికంగా ధ్రువీకరణపత్రాలు జారీ చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

– పీవీ కృష్ణారెడ్డి, తహసీల్దార్, సీతారామపురం

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి



కలప అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇతర ప్రాంతాల నుంచి సీతారామపురం మీదుగా తరలి వెళ్లే కలపను సైతం నిశితంగా పరిశీలించి పంపేలా చర్యలు చేపడతాం. అడవుల వినాశనాన్ని కోరుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

–వెంకటప్రసాద్, డీఆర్వో, సీతారామపురం

సింహ వాహనంపై సంగమేశ్వరుడు



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి సింహ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత కామాక్షితాయి, సంగమేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆదిదంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్ బజార్లలో మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్‌పై మహిళా పోలీసులు సునీత, కోటమ్మ గురువారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సాయం కోసం దానిని వినియోగించాలని సూచించారు.

సీతారాముల గ్రామోత్సవం

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న నవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఐదోరోజు శేష వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాములను శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కావలి : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, కావలి నియోజకవర్గ అధ్యక్షుడు పామంజి శ్యామ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని నివాసంలో రామిరెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం కాకివాయిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ బీ కేశవ చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చేజర్ల ఎస్సై తిరుమలరావు మాట్లాడుతూ కాకివాయిలోని నాలుగు ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని పేర్కొన్నారు.

వ్యాన్ బోల్తా



దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు బీసీ కాలనీ సమీపంలో బుధవారం ఖాళీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దుత్తలూరులోని ఓ గ్యాస్ ఏజెన్సీకి చెందిన మినీ వ్యాను లబ్ధిదారులకు గ్యాస్‌సిలిండర్లను సరఫరా చేసి తిరిగి వస్తున్న క్రమంలో తెడ్డుపాడు బీసీకాలనీ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ హజరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి నర్రవాడ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

దుకాణదారులకు నోటీసులు



సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధం, పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు గురువారం అవగాహన కల్పించి నోటీసులు అందజేశారు. ప్లాస్టిక్ వినియోగించినా, చెత్తను రోడ్డుపై పడవేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, దుకాణదారులు సహకరించాలని కోరారు. పంచాయతీకార్యదర్శులు నరసయ్య, కిషోర్, జరీన్ తాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల నిరసన ర్యాలీ



కలిగిరి: మండలంలోని పాస్టర్లు, క్రైస్తవులు కలిగిరిలో బుధవారం శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్, ముస్లిం మైనార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఏపీఓ బాధ్యతల స్వీకరణ

సోమశిల: అనంతసాగరం మండల ఉపాధి హామీ పథకం నూతన ఏపీఓగా ఎన్ నవీన్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టెక్నికల్ అసిస్టెంట్‌గా రవీంద్ర, కంప్యూటర్ ఆపరేటర్‌గా తనుజారాణి బాధ్యతలు చేపట్టారు.

వ్యవసాయ కళాశాలలో అగ్ని ప్రమాదం

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్ రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. కళాశాల ఆవరణలో ఉన్న గడ్డికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది మంటలను ఆర్పేందుకు యత్నించినా అదుపులోకి రాకపోవడంతో ఉదయగిరి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

ఎస్‌ఏ-2 పరీక్షల పరిశీలన

ఉదయగిరి: పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ -1 మస్తాన్‌వలీ బుధవారం సందర్శించారు. ఎస్‌ఏ-2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ నెల 20 నుంచి ప్రతిరోజూ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పరిధిలోని ఐదేళ్లు నిండిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

భ్రూణహత్యలను నివారించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి: సమాజంలో జరుగుతున్న భ్రూణహత్యలను నివారించాలని కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ అన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధిత చట్ట సలహా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్డీఓ మాట్లాడుతూ లింగ వివక్షతను ప్రతిఒక్కరూ విడనాడాలన్నారు. ఆడపిల్లల సంరక్షణతో పాటు వారిని చదివించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, సీడీపీఓ పద్మజ, సౌజన్య, సలహా మండలి సభ్యులు ఎం మాలకొండారెడ్డి, రెండో పట్టణ హెడ్ కానిస్టేబుల్ రాజన్, తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలను తగ్గించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారాన్ని మోపడం దారుణమని, వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. హిల్ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాయకులు డేవిడ్ రాజు ఎస్‌కే సందానీ, యస్దానీ, హజరత్తయ్య, గుల్జార్‌బేగం, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరులోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత మూలవరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు ధ్వజారోహణ చేశారు. ఉభయదాతలుగా రాచకోట తిరుమలయ్య, సుజాత వ్యవహరించారు. అనంతరం చెన్నకేశవస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 17, 18 వార్డుల్లో అంతర్గత రోడ్లను కమిషనర్ సీ గంగాప్రసాద్, వైస్ చైర్మన్ షేక్ సర్దార్ బుధవారం పరిశీలించారు. బీసీ, ఎస్టీలు అధికంగా నివశించే వార్డుల్లో నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. అందులో భాగంగా మున్సిపల్ సిబ్బందితో రోడ్లను కొలతలు వేయిస్తున్నామన్నారు. త్వరలోనే రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వారి వెంట కౌన్సిలర్ వేణు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రథం పరిశీలన



సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలోని రథాన్ని ఆర్‌అండ్‌బీ ఏఈ అన్వేష్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 12న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఉభయకర్త కోటు కరుణాకర్‌రెడ్డితో కలిసి రథాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను అందజేశారు. రథోత్సవం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన

మర్రిపాడు: మండలంలోని భీమవరం, డీసీపల్లి గ్రామాల్లోని రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై ఏఓ ఎస్ రామమోహన్ బుధవారం అవగాహన కల్పించారు. భూమి కలిగిన ప్రతిరైతు రైతుసేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాన్ని అందజేసి విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తే పథకాలను పొందాలంటే విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు. వీఏఏలు బీ ప్రవీణ్‌సాయి, కే సుష్మ, పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం


ఆత్మకూరు: మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కాకు విజయలక్ష్మి పాల్గొని ఆత్మకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, సీనియర్ నాయకులు కే నాగరాజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక సాయిబాబా మందిరం ఆవరణలో బీజేపీ మండలాధ్యక్షురాలు పీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి క్రియాశీల సభ్యుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. బీజేపీ జిల్లా నాయకులు ముక్కు రాధాకృష్ణ, ఎం బ్రహ్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, పీ నారాయణరెడ్డి, గడ్డం ప్రసాద్, పులిచర్ల నారాయణరెడ్డి, వడ్డె శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మేకపాటి పర్యటన నేడు

సోమశిల: అనంతసాగరం మండల సోమశిల, లింగంగుంట గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సోమశిలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండుబోయిన వెంకటరమణ ఇంటికి చేరుకుని ఆయన కుమార్తెకు ఇటీవల వివాహమైన నేపథ్యంలో నూతన దంపతులను ఆశీర్వదించనున్నారు. అనంతరం లింగంగుంటకు చెందిన సీనియర్ నాయకుడు కేతా రాఘవరెడ్డిని పరామర్శించనున్నారు.

ఉపాధి ఈసీ బదిలీ

సీతారామపురం : మండల ఉపాధిహామీ పథకం ఈసీగా విధులు నిర్వహిస్తున్న సువార్తయ్య ఉదయగిరి మండలానికి బదిలీ అయ్యారు. బుధవారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు

గ్యాస్ ధరల పెంపు దారుణం

జలదంకి: కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ.50 పెంచిందని సీపీఎం మండల నాయకుడు గడ్డం మాల్యాద్రిరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు శక్తి సైతం పడిపోయి అల్లాడుతున్నా దశలో వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజల నెత్తిన భారం మోపడం దారుణమని మండిపడ్డారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు: ఆత్మకూరు డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆ డిపో మేనేజర్ కరీమున్నీసా బుధవారం తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు 99592 25645 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

25న చేపల బహిరంగ వేలం

సంగం: కనిగిరి రిజర్వాయర్‌లోని 1434, 1435 ఫసలీలకు సంబంధించి చేపలను పట్టుకునే హక్కుకు బహిరంగ వేలం ప్రక్రియను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు బుచ్చిరెడ్డిపాళెం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏ పొట్టియ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంగం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ బుధవారం తెలిపారు. 33కేవీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్‌ను ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీత

ఉదయగిరి: అంగన్‌వాడీలు కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలతో పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎన్ సునీత అనారు. పట్టణంలోని యాదవపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆరోగ్య భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బోధకాలు వ్యాధిపై అప్రమత్తత అవసరం


బోధకాలు బాధితులకు కిట్లు అందజేస్తున్న వైద్యులు

ఆత్మకూరు: దోమలతో వ్యాప్తి చెందే బోధకాలు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యులు అనూష, టీజే దేవానంద్ సూచించారు. మహిమలూరు పీహెచ్‌సీలో 92 మంది బోధకాలు వ్యాధిగ్రస్తులకు కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధకాలుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి దాని బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోధకాలు వ్యాధిగ్రస్తులకు ప్రతిరోజూ కాళ్లు శుభ్రం చేసుకునేందుకు అవసరమైన టబ్బు, ఆయింట్‌మెంట్, సబ్బు, మగ్గు, టవల్, తదితర వస్తువులను అందజేస్తున్నామని, జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్‌కే ఖాదర్‌బాషా, ఆరోగ్య సిబ్బంది బీ శైలజ, పీహెచ్‌ఎస్ ఎస్‌కే సైదా, టీ చెంచునాగేంద్ర, హెల్త్‌అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను అధిగమించాలి


ఆత్మకూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సీతారామపురం : ఉపాధి లక్ష్యాలను అధిగమించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని ఏపీఓ శ్యామల అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో పంచాయతీల వారీగా ఉపాధి పనుల పురోగతిపై సిబ్బందితో బుధవారం ఆమె సమీక్షించారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు. మండలానికి 38 పశువుల నీటితొట్లు కేటాయించారని తెలిపారు. అందులో 24 తొట్లకు ప్రతిపాదనలు పంపగా, 9 మంజూరు చేశారని వివరించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పండ్రంగిలో మినీ గోకులం షెడ్డు నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆత్మకూరు: మండలంలోని బండారుపల్లి, దేపూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. బండారుపల్లిలో పశువుల కుంట, దేపూరులో చెరువు పూడికతీత పనులను పరిశీలించి మేట్లకు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించి 11 గంటల్లోగా ముగించాలని సూచించారు. కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన దినసరి వేతనం రూ.307 అందేలా చూడాలన్నారు.

సమయాన్ని పాటిస్తున్నాం

జలదంకి: జలదంకి పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులతో పాటు సిబ్బంది సమయాన్ని పాటిస్తూ రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తాము సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నా కొందరు తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. పాత ల్యాబ్‌టెక్నీషియన్ రసూల్‌ను డీఎంహెచ్‌ఓకు సరెండర్ చేసిన తరువాత అతను ఎక్కడ విధుల్లో ఉన్నాడో తెలియజేయకపోవడంతో జీతం బిల్లు పెట్టలేదన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా అధికారుల విచారణలో కూడా తెలియజేశామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

వరికుంటపాడు/సీతారామపురం: వరికుంటపాడు పీహెచ్‌సీలో ఆయేషా 13 మంది గర్భిణులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. అలాగే సీతారామపురంలో డాక్టర్ స్వప్నారెడ్డి గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు.

త్వరితగతిన గ్రామకొలను పనులు



ఉదయగిరి: ఆత్మకూరు జల వనరుల శాఖ పరిధిలో జరుగుతున్న గ్రామకొలను పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని ఆ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఈఈ విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఏడు గ్రామకొలను పనులు చేపట్టామన్నారు. అందులో ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్ల పనులు పూర్తికాగా, చేజర్ల కొలను పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉదయగిరి గ్రామకొలనుకు రూ.9 కోట్లు మంజూరుకాగా, ఇప్పటి వరకు రూ.4కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మిగిలిన రూ.7 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. సోలార్ లైటింగ్, టైల్స్, బెంచీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.